క్లుప్తంగా

వేద పాఠశాలకు సరకుల వితరణ



సూర్యకాంతమ్మను సత్కరిస్తున్న వేద పాఠశాల ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయ పోషకురాలు కన్నేపల్లి సూర్యకాంతమ్మ 78వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వేద పాఠశాల విద్యార్థులకు గురువారం నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో కన్నేపల్లి సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

రాత పరీక్షకు 167 మంది హాజరు



పరీక్షకు హాజరైననిరుద్యోగ యువత

అక్కిరెడ్డిపాలెం: హైదరాబాద్‌లోని పీయూసీలో సీఎన్‌సీ ఆపరేటర్స్ కోసం ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ఆటోనగర్ వాసీవాలో నిరుద్యోగ యువతకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం జరిగిన డ్రైవ్‌లో ఐటీఐ, డిప్లమో, బీటెక్ అర్హత కలిగిన వారు హాజరయ్యారు. 500 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా రాతపరీక్షకు 167 మంది హాజరయ్యారని పర్యవేక్షకులు మీసాల కాలేబు, ఎంఎస్ఎంఈ టెక్నికల్ సెంటర్ ప్రిన్సిపల్ మురళి కృష్ణ తెలిపారు. ఎంఎస్ఎంఈ పూడి సెంటర్ డీజీఎం జి.ప్రసాదరెడ్డి పర్యవేక్షించారు.

ఔషధాల తయారీలో జాగ్రత్తలు అవసరం

మురళీనగర్ : వైద్య రంగంలో ఔషధాల తయారీలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. స్థానిక కాలేజీలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

- తోకాడలో శిథిలమైన క్వార్టర్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

భయం.. భయం



తోకాడలో చెట్ల మధ్య శిథిల క్వార్టర్లు

అక్కిరెడ్డిపాలెం:

ఖరీదైన నివాసాల మధ్య స్టీల్‌ప్లాంట్‌కు చెందిన శిథిలమై క్వార్టర్స్ దిష్టిబొమ్మల్లా మారాయి. దీంతో స్థానికులు భయం.. భయంగా జీవిస్తున్నారు. శిథిల భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు అసాంఘిక కార్యాకలాపాలు సాగుతున్నాయని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 71వ వార్డు ఆటోనగర్ దరి తోకాడలో స్టీల్‌ప్లాంట్ కార్మికులకోసం నిర్మించిన క్వార్టర్లు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా శిథిలమై పోయాయి. ఇక్కడ 1984 నుంచి 1986 మధ్య కాలంలో సుమారు 5 బ్లాకుల్లో 40వ వరకు నివాసాలు, ఆటోనగర్ ఆర్చ్ నుంచి ప్రధాన రహదారి ఎడమవైపు భెల్ గోడ ఎదురుగా సుమారు 20 నివాసాలు నిర్మించారు. అయితే క్రమేపీ చాలా మంది కార్మికులు సొంత నివాసాలు నిర్మించుకొని క్వార్టర్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు. దీంతో ఖాళీగా ఉండడంతో శిథిలావస్థకు చేరి నిర్వీర్యంగా మారాయి. క్వార్టర్లల తలుపులు, కిటికీలు, కరెంట్ వైర్లు ఇతర ఫర్నిచర్ చోరీకి గురయ్యాయి.

అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా.

శిథిలమైన నివాసాలు అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారాయి. బయట నుంచి వచ్చిన యువకులతో పాటు వారితో స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్న స్థానిక యువకులు కొందరు ఈ క్వార్టర్లలో మద్యం, గంజాయి సేవించడంతో పాటు అసాంఘిక కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇదే విషయమై స్థానిక ఆటోనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని, వారిని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారని వాపోతున్నారు. వీరి ఆగడాలను యువకుల కుటుంబ పెద్దలకు తెలిపిన వారు కూడా నిర్లక్ష్యంగా జవాబులు చెబుతున్నారని స్థానికులు అంటున్నారు.



మరో బ్లాక్‌లో శిథిలనివాసాలు

స్పందించని ఉక్కు యాజమాన్యం

శిథిలమైన క్వార్టర్లను పడగొట్టి ఆ స్థానంలో గార్డెనింగ్, గ్రీనరీ, పార్క్‌ల నిర్వహణ చేపట్టాలని, ఆ బాధ్యతను తమకు అప్పగించాలని కోరినట్లు ఆటోనగర్ క్వార్టర్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. అయినా యాజమాన్యం స్పందించలేదంటున్నారు. శిథిలమైన క్వార్టర్స్ పరిసరాల్లో ఉన్న నివాసాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు అసాంఘిక కార్యాకలాపాలు తమ కళ్ల ఎదుటే జరుగుతున్నా ఏమీ చేయలేని పరిస్థితి. మరో పక్క క్వార్టర్ల నుంచి విషసర్పాలు నేరుగా తమ నివాసాల్లోకి చొరపడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.



తుప్పలు, పొదల మధ్య నివాసాలు

ఇబ్బందులు పడుతున్నాం



శిథిల క్వార్టర్ల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆకతాయిలకు అడ్డాగా మారాయి. విష కీటకాలు, పందులు, కుక్కల బెడద పెరిగింది. వీటి పరిసరాల్లో ఉన్న వారంతా ఇబ్బందులు పడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ అధికారులు వీటితో తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి శిథిల భవనాలు తొలగించాలి.

–బ్రహ్మాజీరావు, ఆటోనగర్ కాలనీ, కార్యదర్శి

ఆకతాయిల బెడద



ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో పరిసరాలు దుర్భరంగా మారాయి. స్టీల్ ప్లాంట్‌కు చెందిన క్వార్టర్స్ శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పరిసరాలన్నీ చెత్తాచెదారంతో దుర్భరంగా ఉన్నాయి. పందులకు, కుక్కలకు ఆవాసంగా నివాసాలు మారాయి. ఆకతాయిల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు పట్టించుకోవాలి. – నిర్మల, తోకాడ

ఉక్కు వీవీవీ పూర్వ విద్యార్థి కుటుంబానికి రూ. లక్ష సాయం



పరుశరాం కుటుంబీకులకు రూ. లక్ష సాయం అందజేస్తున్న వోసా కార్యదర్శి మోహన్‌కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం (వీవీవీ) పూర్వ విద్యార్థులు పేదరికంతో ఉన్న తమ స్నేహితుడి కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేసి తమ ఉదారత చాటుకున్నారు. 1995–96 బ్యాచ్‌కు చెందిన వై. పరుశరాంరెడ్డి తమ కుటుంబంతో ఇస్లాంపేట జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసముండేవాడు. అనారోగ్యంతో గత నెల 27న పరుశరాం మరణించాడు. దీంతో కుటుంబ సభ్యులు స్వగ్రామం ఇచ్ఛాపురం వెళ్లిపోయారు. ఆర్థిక ఇబ్బందులతో పరుశరాం కుమార్తె చదువుకు దూరమవుతుందని స్నేహితులకు తెలిసింది. దీంతో వీవీవీ పూర్వ విద్యార్థుల సంఘం (వోసా) ముందుకు వచ్చి గురువారం వోసా కార్యదర్శి జెర్రిపోతుల మోహన్‌కుమార్ చేతుల మీదుగా ఆ కుటుంబానికి రూ. లక్ష నగదు అందజేశారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వోసా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ, కోశాధికారి ఎస్. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1993 – 94 బ్యాచ్ విద్యార్థులు స్కూల్‌కు తమ సహకారాన్ని అందజేస్తున్నారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 47 మంది విద్యార్థులకు స్కూల్ హెచ్ ఎంఎం.ఎల్.ఎస్.కాంతం చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయించారు. అలాగే 3 నుంచి 7వ తరగతి విద్యార్థులు 150 మందికి ఐడీ కార్డులు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో గాజువాక నాయకులకు చోటు



వెంకటరావు, గౌస్‌లను అభినందిస్తున్న గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి



జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వెంకటరావు, గౌస్



నక్క రమణబాబు



బలిరెడ్డి నాగేశ్వరరావు



అచ్చెంనాయుడు

గాజువాక: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో గాజువాక ప్రాంతానికి చెందిన పలువురు నాయకులకు చోటు దక్కింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని వివిధ వార్డులకు చెందిన ఆరుగురు నాయకులను పలు హోదాల్లో నియమించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు రాజాన వెంకటరావు, జిల్లా అధికార ప్రతినిధిగా ఎస్.ఎం.డి.గౌస్ నియమితులయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నక్క రమణబాబు, బలిరెడ్డి నాగేశ్వరరావును నియమించగా, కార్యాచరణ కార్యదర్శులుగా బొడ్డేడ అచ్చెంనాయుడు, పి.పెంటయ్య నియమితులయ్యారు.

శతశాతం ఫలితాలు సాధించాలి



లంకెలపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీఈవో

అగనంపూడి: ఈ ఏడాది పదోతరగతిలో శతశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా తరగతులు నిర్వహించాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు ఉపాధ్యాయులకు సూచించారు.లంకెలపాలెం, పెదముషిడివాడ జిల్లా పరిషత్ పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ముందుగా పెదముషిడివాడ జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. తర్వాత పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రీ ఫైనల్ పరీక్షలు ఏ విధంగా రాస్తున్నారు. ఏ గ్రేడ్ ఎంత మంది సాధిస్తారు.. పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున ప్రణాళికయుతంగా చదవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం లంకెలపాలెం జెడ్పీ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. టెన్త్ విద్యార్థుల పురోగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పరవాడ మండల విద్యాశాఖ అధికారి సాయిశైలజ, హెచ్ఎంలు రౌతు నాగేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

నేత్ర సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

అగనంపూడి: విద్యార్థులు నేత్రాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు అన్నారు. 85 వార్డు లేమర్తి జెడ్పీ పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రియాల్లో నయనం ప్రధానమైందని మరువకూడదన్నారు. అందమైన ప్రపంచాన్ని, ప్రకృతిని కళ్లతో చూసి మనసు ఆనందిస్తుందని అటువంటి నేత్రాలను మనం జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. దృష్టి లోపం ఉంటే వెంటే కళ్లను పరీక్షించుకోవాలన్నారు. అనంతరం రాంకీ ఫౌండేషన్ యాజమాన్యం సమకూర్చిన కళ్లద్దాలను ఆయన విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ మేనేజర్ శ్రీకాంత్, రాజేశ్వరి, పాఠశాల హెచ్ఎం అమ్మాజీ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, వెంకటరావు పాల్గొన్నారు.

రక్త హీనతపై విద్యార్థినులకు అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

గాజువాక: రక్తహీనతపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ రక్తహీనత దినం సందర్భంగా లీఫార్మా, జేసీఐ వైజాగ్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జేసీఐ ప్రతినిధి రమ్య అగస్త్య మాట్లాడుతూ శరీరంలో తగినంత హిమోగ్లోబిన్ లేకపోవడాన్ని రక్తహీనత అంటారన్నారు. రక్తహీనత వల్ల అలసట, మందకొడితనం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అలాగే సరోజిని నాయుడు జయంతి సందర్భంగా కళాశాలలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లీ ఫార్మా ప్రతినిధి జయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, వివిధ విభాగాధిపతులు పి.వి.డి.సౌజన్య కుమారి, ఎ.సుజాత, మాధవీలత, కైసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి ఎస్.కె.శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో దువ్వాడ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న విజ్ఞాన్ చైర్మన్ రత్తయ్య

అగనంపూడి: విజ్ఞాన్ జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో దువ్వాడ విజ్ఞాన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి యువజనోత్సవంలో దువ్వాడ విజ్ఞాన్ విద్యార్థులు వాలీబాల్, షాట్‌పుట్ పోటీల్లో సత్తాచూపారు. విజయోత్సవ సభలో విజ్ఞాన్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు కార్యక్రమంలో రెక్టార్ మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయలొచ్చేశాయ్



ముక్కలుగా కోసి అమ్ముతున్న పుచ్చకాయలు

పెదగంట్యాడ: వేసవి తాపం అప్పుడే ప్రారంభమైంది. వారం కిందట వరకూ గిలిగింతలు పెట్టిన చలి ఒక్కసారిగా కనుమరుగైపోయింది.. రథ సప్తమి వెళ్లడంతో భానుడు ప్రభావం చూపడం ఆరంభించాడు. దీంతో ఉష్ణతాపం నుంచి ఉపశమనాన్నిచ్చే ఫలాలు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. వేసవి ఫలాల్లో ఒక్కటైన వాటర్‌మిలాన్ (పుచ్చకాయ) విక్రయాలు మండలంలో పలు చోట్ల ప్రారంభమయ్యాయి. కణితి రోడ్డు, సమతానగర్, పెదగంట్యాడ, నెల్లిముక్కు, నమ్మిదొడ్డి తదితర ప్రాంతాల్లో వ్యాపారులు పుచ్చకాయలను కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారు. కిలో రూ.30 నుంచి 40 వరకు విక్రహిస్తున్నారు. పండు సైజును బట్టి రూ. రూ.100 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు. అక్కడక్కడ ముక్కలుగా కోసి రూ.15కి అమ్ముతున్నారు. మరో నెల గడిస్తే మార్కెట్‌లోకి దిగుబడి విస్తృతంగా వస్తుందని, అప్పుడు కిలో రూ. 20కి వస్తుందని విక్రయదారులు చెబుతున్నారు.

డిమాండ్ లెటర్లు సరే... పీపీవో ఆర్డర్లు ఎప్పుడో ?



స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఎవరిని కదిపినా ప్రస్తుతం హయ్యర్ పెన్షన్ , వీఆర్ఎస్ అంశాలపైనే చర్చ సాగుతోంది. వీఆర్ఎస్ దరఖాస్తు ప్రక్రియ పూర్తయి తుది నిర్ణయం యాజమాన్యం చేతుల్లోకి వెళ్లింది. ఇక రెండో అంశం హయ్యర్ పెన్షన్. దీన్ని కొంతకాలం తొక్కిపెట్టిన పీఎఫ్ అధికారులు ఎట్టకేలకు హయ్యర్ పెన్షన్ డిమాండ్ లెటర్లు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 5500 డిమాండ్ నోటీసులు వచ్చాయి. దీన్ని ఉద్యోగులు స్వాగతిస్తున్నారు.

- అయితే 16 నెలల కిందట సుమారు రూ. 410 కోట్లు జమ చేసిన ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇంత వరకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీవో) రాకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. లక్షల్లో కట్టాలని డిమాండ్ నోటీసుల్లో పేర్కొంటున్నారు. అప్పో, సప్పో చేసి కట్టడానికి సన్నద్ధం అవుతున్నా .. మరోవైపు ఇంతకు ముందు డబ్బు కట్టిన వారికి పెన్షన్ ఆర్డర్ వస్తే చూద్దామనుకుంటున్నారు. వారికి పెన్షన్ ఎలా లెక్క కట్టారో అనే దాన్ని బట్టి ముందుకు వెళ్లాలని ఉద్యోగులు భావిస్తున్నారు. ఇప్పటికే నగదు జమ చేసిన వారికి పీపీవోలు జారీ చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

తహశీల్దార్ వారి కార్యాలయం
గాజువాక మండలము

పత్రికా ప్రకటన

గాజువాక మండలం కాపురస్తులు కంఠిమహంతి నర్సింహరావు తండ్రి మహేశ్వరరావు (లేటు), డోర్ నెం. 8-1-54/6, గాజువాక, విశాఖపట్నం వారు ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు "నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామం పేరు	సర్వే నెం.	విస్తీర్ణము
తుంగ్లాం	71-2D2B	404 చ॥గ॥
తుంగ్లాం	71-2D1 Part	16 చ॥గ॥

పైన తెలిసిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా ఈ కార్యాలయమునకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహశీల్దార్
గాజువాక మండలం, విశాఖపట్నం

టు,
కంఠిమహంతి నర్సింహరావు,
తండ్రి మహేశ్వరరావు (లేటు),
డోర్ నెం. 8-1-54/6,
గాజువాక, విశాఖపట్నం.

తహశీల్దార్ వారి కార్యాలయం
గాజువాక మండలము

పత్రికా ప్రకటన

గాజువాక మండలం కాపురస్తులు శ్రీ కంఠిమహంతి వెంకటరమణ మూర్తి తండ్రి మహేశ్వరరావు (లేటు) డోర్ నెం. 8-1-54, గాజువాక, విశాఖపట్నం వారు ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు "నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామం పేరు	సర్వే నెం.	విస్తీర్ణము
తుంగ్లాం	71-2D2B	422 చ॥గ॥

పైన తెలిసిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" (NOC) మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా ఈ కార్యాలయమునకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహశీల్దార్
గాజువాక మండలం, విశాఖపట్నం

టు,
కంఠిమహంతి వెంకటరమణ మూర్తి
తండ్రి మహేశ్వరరావు (లేటు)
డోర్ నెం. 8-1-54,
గాజువాక, విశాఖపట్నం

తహశీల్దార్ వారి కార్యాలయం
గాజువాక మండలము

పత్రికా ప్రకటన

చినగదిలి మండలం, పి.ఎం.పాలెం గ్రామ కాపురస్తులు పిల్లిమార్గరెట్ సరళా సౌభాగ్యవతి భర్త. పి.వెంకటరావు (లేటు), బాలాజీ ఆర్కేడ్. ఫ్లాట్ నెం. 201. పి.ఎం.పాలెం. చినగదిలి మండలం, విశాఖపట్నం వారు ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు "నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామం పేరు	సర్వే నెం.	విస్తీర్ణము
తుంగ్లాం	71-2D2B	196 Sq. Yds

పైన తెలిసిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా ఈ కార్యాలయమునకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహశీల్దార్
గాజువాక మండలం, విశాఖపట్నం

టు,
పిల్లిమార్గరెట్ సరళా సౌభాగ్యవతి
భర్త. పి.వెంకటరావు (లేటు),
బాలాజీ ఆర్కేడ్, ఫ్లాట్ నెం. 201. పి.ఎం.పాలెం. చినగదిలి మండలం, విశాఖపట్నం.

తహశీల్దార్ వారి కార్యాలయం
గాజువాక మండలము

పత్రికా ప్రకటన

షీలానగర్ కాపురస్తులు శ్రీ ఏగినాటి వెంకటేశ్వరరావు తండ్రి శేషయ్య (లేటు), ఎస్.టి బి.ఎల్., ఎస్.ఆర్ గార్డెన్స్, షీలానగర్, విశాఖపట్నం వారు ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు "నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామం పేరు	సర్వే నెం.	విస్తీర్ణము
తుంగ్లాం	71-2D2B	200 Sq. Yds

పైన తెలిసిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా ఈ కార్యాలయమునకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహశీల్దార్
గాజువాక మండలం, విశాఖపట్నం

టు,
ఏగినాటి వెంకటేశ్వరరావు,
తండ్రి శేషయ్య (లేటు),
ఎస్.టి బి.ఎల్., ఎస్.ఆర్ గార్డెన్స్,
షీలానగర్, విశాఖపట్నం-530012